# మైనస్ ఇంటూ మైనస్...?

## శ్రీమతి అయ్యాగారి వెంకట సత్యవతి

అది రోహిణికార్తె పగలు పదకొండు గంటల సమయం సూర్యభగవానుడు తన తీక్షణమైన దృక్కులను నలువైపులా ప్రసరించేసరికి భయపడిన మానవాళి రోడ్డు యెక్కేందుకు వెనకాడుతూ, తప్పని పరిస్థితిలో ఒకటీ, అరా, బయటపడుతూ, మొత్తానికి నిర్మానుష్యంగానే ఉందనిపిస్తున్నారు

వెంకట్రామయ్యగ్గారు దేవుని గదిలో జపం చేసుకుంటున్నారన్న మాటేగానీ ఆయన మనస్సు వ్యాకులపాటుతో కలవరపెడుతూ ధ్యానాన్ని చెదరగొడుతోంది ఎంత వద్దనుకున్నా మాటి మాటికీ తను చేసిన తప్పిదం తనని వెక్కిరిస్తూ పరిహాస నృత్యం చేయడంతో తల్లడిల్లిపోతున్నారాయన ప్రస్తుత పరిస్థితిలో తను చేయవలసిందేదో, చేయకూడనిదేదో తెలియని అయోమయంలో కొట్టుకుపోతున్నారు ఆయన మనఃక్లేశాని కంతటికీ కారణభూతురాలయిన కాగితం సావిడి గదిలో బల్ల మీద రెప రెపలాడుతోంది ఆయన మనస్సులాగే ఇంక తనవల్ల కాదని నిర్ధారణకొచ్చిన వెంకట్రామయ్యగారు చప్పున పీట మీంచి లేచి భుజాన కండువా దులిపి పూజ గదిలోంచి బయటపడ్డారు ఆ కాగితం తనని చూచి నవ్వుతున్నట్టనిపించి పెద్ద పెద్ద అంగలతో సావిడి గదిలోకి ప్రవేశించి ఆ కాగితాన్నందుకుని చింపి ప్రోగులు పెడదామనుకునేంతలో భార్య సరస్వతమ్మగారు ప్రక్కింట్లోంచి రావడం, చేతిలో కాగితాన్ని ప్రశ్నార్థకంగా చూసిన ఆవిడ, భర్త వింత వైఖరి గమనించి, తెల్లబోతూ చింపబోతున్న ఆయన చేతులని చటుక్కున ఆపి వేసి కాగితాన్నందుకుని చరచర వంటింటికేసి నడవడం క్షణాలలో జరిగిపోయింది

కొంగు చాటున అప్పుగా తెచ్చిన గిన్నెడు బియ్యం క్రింద పెట్టి, అదిరే గుండెలతో ఆ వుత్తరాన్ని చదువుతున్న సరస్వతమ్మ గారి పెదవులు అదురుతూంటే, కళ్ళు శ్రావణ మేఘాలే అయ్యాయి మసకబారుతున్న వుత్తరాన్ని పదే పదే చదువుతూ వణికే చేతులతో బాధగా ఆ కాగితాన్నే తన కుమారునిగా భావించి నిమురుతూ బాబూ ఎందుకిలా చేశావూ? మేమేమయి పోవాలనుకున్నావురా? నీ ఒక్కడి సుఖంతోనే సరిపెట్టుకో చూసావురా కన్నా! ఇంతటి స్వార్థం


కరడుగట్టిన పాషాణ హృదయం నీకున్నాయని ముందుగా తెలిసి వుంటే మాకీ క్షోభ వుండునా? మూగగా తనలో తనే కుమిలి రోదిస్తున్న ఆమె భుజంపై వణుకుతున్న చేయి పడటంతో చప్పున కళ్ళు తుడిచేసుకుని లేని నవ్వు తెచ్చి పెట్టుకుంటూ ఒక్క క్షణంలో అన్నం వండేస్తాను మీ కిష్టమని జానకమ్మగారు లేత దొండకాయలు అప్పటికప్పుడు పాదునుండి కోసిచ్చింది అన్నయ్యగారికిష్టం కదా! వండి పెట్టండి అంటూ మారీలోగా భగవద్గీత పారాయణ చేసుకుంటూండండి అనేసి గబగబ అక్కడ్నించి నిష్క్రమించబోయిందామె భార్యనే నిశితంగా పరికిస్తున్న వెంకట్రామయ్యగారు నిర్లిప్తంగా నవ్వుకున్నారు

సరసూ ఎందుకొచ్చిన దాగుడుమూతలే యివి? నీ మనస్సు సముద్ర ఘోష పెడుతూంటే ప్రశాంత వదనాన్ని యెలా వ్యక్తం చేయగలననుకున్నావు? పిచ్చిదానా మనం మానవ మాత్రులం మన ముఖమే మన మనస్సుకి దర్పణం వంటిదని తెలీని పసివాళ్ళమా మనం ఒకర్నొకరు మభ్యపెట్టుకో జూడటం అనవసరం మనస్సు విప్పి బాధ వెళ్ళగ్రక్కుకుంటే తెరిపిన పడతామనే యిలా నీ కోసం వంటింట్లోకి పరుగెట్టుకు వస్తే నీవేమో పలాయన మంత్రం పాటిస్తున్నావేమిటే ఆర్ద్రత నిండిన స్వరంలోంచి గాద్గదికంగా మారుతున్న ఆయన మాటలు విని చివ్వున తలయెత్తి భర్త ముఖంలోకి బేలగా చూస్తూ ఏమండీ! అంటూ సుడిగాలిలో ఆయన వడలిన బాహువల్లరిలోకి దూరిపోతూ చిన్నపిల్లలా వెక్కి వెక్కి యేడ్చింది ఆవిడ భార్యని సముదాయిస్తూ మౌనంగా దుఃఖాన్ని దిగమ్రింగుకున్నారాయన కొద్ది క్షణాలు గడిచాయి తేలికపడ్డ హృదయం స్థానే రోషం వుక్రోషం పెల్లుబికిరావడంతో భర్త కౌగిలి నుండి విడివడి రుద్రకాళే అయింది ఆవిడ

ఆ వెధవ ఆ త్రాష్టుడు ఎంత ద్రోహం చేశాడండి తల్లి రొమ్మును తన్నిన దౌర్భాగ్యుడు ఏనాడయితే మనం లేమనుకుని వాడి దారి వాడు చూసుకున్నాడో అదే క్షణాన వాడు మనకు చచ్చినట్లే లెక్క ఎంత తెలివితక్కువగా మనం బాధపడ్డామో తల్చుకుంటుంటే రోత పుడుతోంది పాముకి పాలు పోసి పెంచిన చందాన వాడిని పెంచాము వాడ్ని గురించి దిగులుపడటం అవివేకం అంటూ పూనకం వచ్చిన దానిలా ఆవేశపడుతున్న ఆమెనిమందలిస్తున్నట్టు ఆవిడ నోటిపై చేయి వుంచేరు

సరసూ! తెలివి మీదే మాట్లాడుతున్నావా! ఎంత చెడ్డవాడు మన బిడ్డ మన రక్తం పంచుకు పుట్టిన పుత్రుడు వాడి క్షేమం కోరవలసింది పోయి నోటికి వచ్చినట్టు తిట్టటం సబబుగా వుందా? నిజం చెప్పు మనకు 'వాడు చచ్చినట్లే లెక్క' అని మనస్పూర్తిగా అనగలుగుతున్న మాటలేనా అవి తప్పు పిల్లల అభివృద్ధి నాకాంక్షించే తల్లిదండ్రులనవలసిన మాటలు కావవి ఒకనాడు కన్నూ మిన్నూ కానని దురహంకారంతో హద్దులు మీరి కన్న కూతురినే నోటికి వచ్చినట్టు తూలనాడిన నన్ను ఏ తండ్రీ అనకూడని మాటలతో దుర్భాషలాడిన నన్ను ఛీదరించుకున్నావు నా కూతురు ఏహ్య భావంతో ఒక్క చూపు విసిరింది మర్చిపోయావా సరసూ! ఎవరయితే నెత్తి మీద రాయి పెడతారని భావిస్తూ వున్నదంతా పూడ్చి పెట్టి అంచెలంచెలుగా శిఖరాగ్రానికి ఎక్కించానో ఆ సుపుత్రుడు మనలని అగాధంలోనే వుంచి నవ్వులపాలు చేశాడు పైగా 'అత్తవారింటికి పోయే కూతుళ్ళని ఆదుకోవలసిన ఆర్థికంగా ముచ్చట్లు జరిపించాల్సిన పని లేదంటూ అదంతా బూడిదలో పోసిన పన్నీటి ప ... న దండగ' అని నిర్లక్ష్యం చేసి గాయపరచేనో ... నకింక గతి 'అయ్యారు ఇదిగో ఇంకో వుత్తరం ... పదిలంగా, అపురూపంగా, యింకా చెప్పాలంటే ప్రాణ సమానంగా బొడ్లో దోపుకున్నాను ఈ వుత్తరం ఎక్కడ్నుంచో తెలుసా? ఆనాడు తూట్లు పొడిచే మాటలతో నేను గాయపరచిన నా కూతురు శారద తల్లి దగ్గర్నుండి అంటూ మరొక్క క్షణం అక్కడ నిలువలేనట్టు షర్ట్ వేసుకుని చెప్పులు తొడుక్కుని గబగబ వీధిలోకి వెళ్ళిపోయారు వెంకట్రామయ్య గారు నిశ్చేష్టురాలై వెర్రిగా చూస్తుండి పోయిన సరస్వతమ్మ యీ లోకంలోకి వచ్చినట్టయి చేతిలో భర్త కుక్కి వెళ్ళిన మరో

వుత్తరాన్ని ఆతృతగా చదువుకోసాగింది అక్షరాల వెంట కళ్ళు చకచక పరుగు తీస్తుంటే ఉద్వేగానికి తట్టుకోనేరక మనస్సు యెగిరెగిరి పడుతోంది శారద వుత్తరంఆసాంతం చదివిన సరస్వతమ్మ గారు గాడంగా నిట్టూర్చారు ఒక చేతిలో కూతురి సుదీర్ఘ వుత్తరం మీకేం పర్వాలేదు నేనున్నానంటూ ధైర్యం చెబుతూంటే వుబ్బి తబ్బిబ్బవుతున్న ఆవిడకి క్రిందనే అతి గారాబంగా పెంచిన ఒక్కగానొక్క ముద్దుల తనయుడు శేఖర్ వుత్తరం కంటకప్రాయంగా తోచి చటుక్కున దాన్ని అందుకుని ముక్కలు ముక్కలు చేశారు వుత్తరాన్నయితే ముక్కలు చేయగలిగారు కానీ అందులోని విషయాలని తుడిచి పెట్టలేకపోయారు వద్దనుకున్న కొద్దీ శేఖర్ వుత్తరం మనస్సులో మెదులుతూ కకావికలయిపోతున్నారు ఆవిడ




కాన్పూరు
12 10 84

పూజ్యులైన నాన్నగారికి!

శేఖర్ నమస్కరించి వ్రాయునది నేనిక్కడ మా మానేజింగ్ డైరెక్టర్‌గారి కూతురు సుషమా అగర్వాల్‌'ని వివాహం చేసుకున్నాను మీ ఆమోద ముద్ర యెలాగూ వుండదన్న నమ్మకంతో నా మనస్సును ముందుగా పాడు చేసుకోనిచ్చగించక మీకు ముందుగా తెలియపర్చలేకపోయినాను నేనేదో కృతఘ్నుడ్ని అనీ, మిమ్మల్నేదో అన్యాయం చేశానని తలపోస్తే దానికి నేను బాధ్యుడ్ని కాను నన్ను అష్టకష్టాలు పడి, వున్న యిల్లు అమ్మి ఐ ఐ టి లో చేర్పించి నన్నొక ఇంజనీర్‌ని చేశారు కాదనను అయితే ఒక వ్యక్తి పురోభివృద్ధికి కారణం కేవలం అవకాశాలు వుండగానే సరిపోదనీ, దానికి తగ్గ కృషి వుంటేనే రాణిస్తాడనీ మీకు చెప్పనవసరం లేదు మీరు యింటిని అమ్మి చదివించినందుకు

బాధపడవలసిన పనిలేదు ఏమంటే చివరికి ఆ యిల్లు నాకే చెందుతుంది కదా! అది ముందుగా నా భవిష్యత్‌కి బంగారు బాట నేర్పరిచేందుకు వుపయుక్త మయింది కనుక మీరిందులో పెద్దగా విచారించవలసిన పనేముంది? అది మీ ధర్మం కూడ నామీద యేదో పెట్టుబడి పేట్టేసి దానిమీద జీవితాంతం లాభం గడించేయాలన్న వుద్దేశ్యం



# మైనస్ ఇంటు మైనస్....?

శ్లాఘనీయమయింది కాదు నా జీవితం నాకు నచ్చిన రీతిలో మలుచుకునే స్వాతంత్ర్యం, హక్కు నాకున్నాయి ఒకరి యిష్టాలకి కట్టుబడి నా మనస్సుని చంపుకోలేను మా మానేజింగ్ డైరెక్టర్‌కి

నా మీద మంచి గురి వుంది భవిష్యత్తులో మంచి పురోభివృద్ధిని సాధించగల బ్రిలియంట్‌ననే విశ్వాస మేర్పడింది దానికి తగ్గ రాచబాట నేర్పరచేందుకే ఆయన తన కూతుర్ని నాకిచ్చి వివాహం జరిపించారు నేనిక్కడ యెక్కువ కాలం వుండబోను ఫారిన్ కంట్రీస్‌కి పంపే వుద్దేశ్యంలో వున్న మా మామగారి ఆశయాలకు ప్రతీకని స్వార్థపరుడ్నని తిట్టుకున్నా నాకేం బాధలేదు ఈ లోకంలో స్వార్థం లేని జీవి లేడు మీ కొచ్చే పెన్షన్‌తో మీ యిద్దరి జీవితాలు వెళ్ళమార్చటం కష్టం అనే సంగతి నాకూ తెలుసు ప్రస్తుతం మంచి హో దాగల వుద్యోగంలో వున్నా– నాకు డబ్బు చాలా అవసరం నా ఆశయం నెరవేరి నిలద్రొక్కుకున్న నాడు మీ ఋణం వుంచుకోను అప్పటి వరకూ మీ యిద్దరి జరుగుబాటుకి కాగల ఖర్చుని అక్క శారద, చెల్లెలు వసుంధర భరించే యేర్పాటు చేసుకోండి అది అప్పుగానే తీసుకోండి అణాపైసలతో సహా తర్వాత నేను తీరుస్తాను అయితే మీ శేష జీవితాన్ని నా దగ్గర వెళ్ళమార్చుకునే అవకాశాన్ని మీకు కలిగించలేక పోతున్నానని తెలియపర్చుటకు విచారిస్తున్నాను కారణం నా భార్య పరబాషది కావడమే అనుకుంటే అది పొరపాటు ఒక తరానికి మరో తరానికి భేదాభిప్రాయా లుండటం అతి సహజం ఒకర్నొకరు తమ వ్యక్తిత్వాలను చంపుకుంటూ తలఒగ్గుతూ బ్రతకడం నా దృష్టిలో హేయకరం నావల్ల యెదైనా ఆశాభంగం పొందివుంటే క్షంతవ్యుడ్ని

ఇట్లు,
మీ కుమారుడు,
చంద్రశేఖర్


విరక్తిగా నవ్వుకుంది సరస్వతమ్మ 'బాబూ!కన్నబాబూ! బాగా బుద్ధి చెప్పావురా! నీదంతా ఆధునికత ఒంట బట్టించుకున్న యువకరక్తం మా వయస్సు వచ్చిననాడు, మేము దేనికోసం తపించిపోయామొ గ్రహించిననాడు, నీ కంటికి కనబడమన్నా కనిపించని లోకాలను చేరుకుంటామురా! మా యిద్దరి కడుపులు నింపుకుందుకి 'దేహి' అని అల్లుళ్ళని యాచించమని యిచ్చిన నీ సలహాకి జోహార్లు బాబూ! 'కన్న తలిదండ్రుల ఋణం తీర్చేసుకుంటాను అది కూడ అప్పు తీర్చి' అంటున్న నీ అతి తెలివికి నవ్వాలో యేడవ్వాలో అర్థమవడం లేదురా నాన్నా!' అనుకుంది కంట తడిపెడుతున్న తల్లిని చూసి ఎందుకమ్మా బాధపడుతున్నావు? మేము లేమూ? కూతుళ్ళ నెందుకమ్మా వేరుగా తలుస్తారు? అని ఆవేదన చెందుతూ పూరడిస్తున్న శారద ఉత్తరం లోంచి కనిపించి, జాలిగా చూసినట్లనిపించి వులిక్కిపడ్డారు ఆవిడ

అమలాపురం
16–10–84

పూజ్యులైన నాన్నగారికి!

శారద నమస్కరించి వ్రాయునది ఉభయకుశలోపరి నాన్నా! ఈసరికి 'కన్నబాబు' వ్రాసిన వుత్తరం మీకు అంది వుంటుందని, మనఃక్లేశంతో తల్లడిల్లి పోతుంటారనీ గ్రహించి యిది వ్రాస్తున్నాను శేఖర్ చేసిన పని పెద్ద షాక్‌లాంటిది కాదనను కాని నాన్నా! నేను సమయానికి చెప్పుతున్నానేమోనని భావించక ఒక్కటి గుర్తు తెచ్చుకోండి ఒకానొక సమయంలో మీ పరుష వాక్యాలని సహించనేరక, శేఖర్ మీద నేను వెలిబుచ్చిన అభిప్రాయం నేడిలా నిజరూపం దాల్చడం నాకేమంత ఆశ్చర్య మనిపించలేదు అతి గారాబంతో, ఒక్కగా నొక్క మగపిల్లడన్న వెర్రి మమకారంతో, శేఖర్‌లోని మనిషిని మీరు గుర్తించకున్నా, చిన్నప్పట్నుంచీ వాడిలోని చురుకుతనం, తెలివి తేటలతో బాటు పెంచుకుంటున్న స్వార్థపు టాలోచనలని అక్కగా గుర్తించ గలిగాను ఏది ఎలా జరగాలో చూస్తుండటం మినహా చేయగలిగింది లేదన్న నిస్సహాయ స్థితిలో వున్న ఆడకూతురిని ఆడపిల్లంటేనే చిరాకుతో కూడిన ఏవగింపుతో అమడదూరం పరుగెట్టే, మీకు, నా మనస్సు విప్పి చెప్పగలిగేటంత చనువుని పెంచుకోలేకపోయాను పుట్టుకతోనే 'మైనస్' అని ముద్రింపబడిన మా అక్కా చెల్లెళ్ళు మీ చెంతకు చేరేందుకు భయపడటంలో వింత లేదు ప్రతీ నిమిషం లాభనష్టాల బేరీజుతో మగ, ఆడపిల్లలని వ్యత్యాస దోరణిలో పెంచుకొచ్చిన మీ ముందు పెదవి కదప సాహసించలేక పోయాను

నాన్నా! జరిగిందేదో జరిగిపోయింది కూతుళ్ళు తమ బిడ్డలనే గుర్తించి, వారిని పరాయి వారుగా చూడక, వారి సంపాదన వాడేందుకు వారి ఆలనా, పాలనలో జీవితం వెళ్ళబుచ్చేందుకు సంకోచించక నిరభ్యంతరంగా, నిర్భయంగా మనుగడ సాగించిననాడు ఆ తలిదండ్రు లిలాంటి మనో వేదనకి గురికావలసిన అగత్యం వుండబోదని చెప్పగలను అప్పుడింక మగ, ఆడ వ్యత్యాస దోరణి నవలంబించవలసిన పనిలేదు ఎవరి పరిస్థితనుకూలంగా వుంటే వారు నిస్సంకోచంగా తలిదండ్రులను వృద్ధాప్యంలో ఆదరించవచ్చును దానికి కేవలం మగ బిడ్డడే బాధ్యుడన్న నియమం సడలిననాడు మన మనో దౌర్బల్యం సమూలంగా నాశనమవగలదు ఇంతకీ ఇదంతా యెందుకు వ్రాస్తున్నానో మీరు గ్రహించే వుంటారు శేఖర్ చేసిన పనికి మీ అల్లుడు చాల బాదపడ్డారు అంతేకాదు, మిమ్మల్ని మా అత్త మామలలో చూసుకుంటు వినయ విధేయతలతో నడుచుకుంటున్న నేనంటే వారికి ప్రాణం అందుకే



వెంటనే మీ యిద్దరినీ వచ్చెయ్యమనీ 'కలిగినంతలోనే కలో గంజో త్రాగుదాం మా ముసలాళ్ళకి ముసలాళ్ళు తోడు, కాలక్షేపం' అన్నారు మా అత్తగారు, మావగారు భగవత్ కృపవల్ల తలదాచుకునేందుకో పెద్ద యిల్లు, తినేందుకో నాలుగెకరాల మాగాణీ పొలం వున్న యింట నేనున్నానంటే దానికి కారకులు మీరేకదా! మనకే లోటులేదు వాడి అమ్మా నాన్నలం మేమున్నట్లే, మీ అమ్మా, నాన్న లిక్కడ వుంటే వచ్చే నష్టమేముంది?

సరదాగా మేము నలుగురం కలిసి తీర్థయాత్రలకి పోయివస్తాము ఒంట్లో ఓపిక వున్ననాడే నాలుగూ చుట్టబెట్టాలి ఆ తర్వాత యెటూ కదలలేం కదా! అంటూ ఒకటే హడావిడి పెట్టేస్తున్నారు మీ అల్లుడయితే ఏమోయ్ వ్రాశావా రమ్మనమని? నీకేకాదు అత్త మామలని కంటికి రెప్పలా చూడటం వచ్చునుకునేది నాకూ వచ్చు అంటు ఆయన నన్ను నిలవనీయడం లేదు కాబట్టి యీ వారంలో ఆయన పని తెముల్చుకున్న వెంటనే మేమే బయల్దేరి వస్తున్నాము కూతురి యింట శేష జీవితం గడపాల్సి వచ్చిందనే న్యూనతా భావాన్ని చెరిపి వేయండి కృతఘ్నుల్లాంటి కొడుకు లున్నచోటే మానవత్వం గల అల్లుళ్ళూ వుండగలరు నాన్నా! మనం జన్మ నిచ్చిన సంతానమందరూ సమానమే అనుకుంటే సిగ్గు పడవలసిన అవసరమే రాదు కూతురి యింట గడిపేందుకు

నాన్నా! మరో చిన్న విషయం చెల్లి వసుంధర ప్రేమించి పెళ్లి చేసుకుని మీకు దూరమయినా నా కెప్పుడూ సన్నిహిత్వంగానే వుంది అది కూడా యిక్కడే వుందని మీకూ తెలుసు ఈ కాలంలో ఇంకా యీ లేనిపోని పట్టింపులు ఎందుకు నాన్నా! 'శాఖ' వేరన్న మాటేగానీ మీ రెండో అల్లుడూ మన కులంవాడే కదా ఆ మాటకి వస్తే వర్ణాంతర వివాహాలని కూడా ఆమోదించే వారున్నారు కాదా! శేఖర్ యేకంగా భాషాంతర వివాహాన్నే చేసుకుని మనల్నందర్నీ కాదనుకుని వదిలించుకు పోయేడే వాడికంటే వసుందర నయం కదూ! మనకోసం ముఖ్యంగా మీకోసం ప్రాకులాడుతోంది దురదృష్టవంతురాలు అటు అత్త మామలు కూడ లేరు దానికి వున్న ఒక్క వదినగారు 'దుబాయ్'లో వుంటోందిట మేము ఆసరాగా వున్నా మిక్కడ పదిరోజుల క్రితమే పండంటి బాబుని కన్నది ఆఫీసుకి శలవు పెట్టేసింది అతను అంటే మీ చిన్న అల్లుడు వంట, ఆఫీసు పనితో సతమత మవుతూంటే చూడలేక మా అత్తగారు మందలించి యింటినుంచి కారియర్ పంపే యేర్పాటు చేసేరు అసలు మా యింటికే వచ్చెయ్యమని పిలిస్తే అభిమానం గల వాళ్ళిద్దరూ ససేమిరా రామన్నారుట మా పాట్లేవో మేము పడతాం పిన్నిగారూ! కావలసిన మా అత్త మామలే వదుల్చుకుంటే మీ కెందుకండీ బాబూ మా

# మైనస్ ఇంటు మైనస్....?

అవస్థలు అమ్మ, నాన్నలని , చిన్నతనంలోనే పోగొట్టుకున్న దురదృష్ట వంతుడికి పెన్నిధిలా దొరికేరు మీరు, బాబాయిగారు , మీ ఆదరాభిమానాలు చాలు అంతకంటే అత్యాశకి పోను అన్నాడుట కృష్ణమూర్తి నాన్నా! నీవు నిజంగా అదృష్టవంతుడివి నిన్ను, అమ్మని, పువ్వుల్లో పెట్టి చూసుకునేందుకు రెండు కళ్ళల్లాంటి యిద్దరు ఆడపిల్లలం వున్నాము రత్నల్లాంటి యిద్దరు అల్లుళ్ళు వున్నారు మీ స్నేహం కోరుతూ తపించిపోతున్న మా అత్తమామ లున్నారు ఇంకేం కావాలి నాన్నా? నీ కింక లోటేమిటి? ఒక్క శేఖర్ కాదన్నాడని కృంగిపోవలసిన దౌర్భాగ్యం మీకు లేదు వాడినుండి పైసా ఆశించవలసిన నికృష్ట పరిస్థితి మీకు లేదు అప్పుగా మిమ్మల్ని పోషించమని సలహా యిచ్చిన నీచుడి గురించి బెంగటిల్లవలసిన ప్రారబ్ధం మనకి లేదు వాడి బాగు వాడు చూసుకున్నాడు వాడి బ్రతుకు వాడిది వెనక్కి తిరిగి మనల్ని చూడలేదని వాపోవడమన్న అవమానకరమైన ఆలోచన మరొకటి లేదు అమ్మకి కూడా యివే మాటలుగా చెప్పండి మాతో వచ్చేందుకు తయారుగా వుండమని - ప్రార్థిస్తూ

మీ కూతురు,
శారద

అవిరామంగా కారే కన్నీటిని ఒత్తుకుంటూ గబగబా లేచి వంట కుపక్రమించేరు సరస్వతమ్మగారు వంట అయిందనిపించి బయటపడేసరికి లోని కడుగు పెడుతున్న భర్త వెంకట్రామయ్యగారిని చూసి గతుక్కుమన్నారు తొంభయ్ యేళ్ళ వార్థక్యం మీదపడినట్లు కృశించి పీక్కుపోయిన ముఖం నీరసంతో సత్తువే లేనట్లు పడక్కుర్చీలో సోలిపోతున్న తీరు ఆవిడలో గాభరా పుట్టించాయి పరుగున ఒక్క అంగలో భర్తని చేరి ఏమండీ అంటూ ఆదుర్దాగా కుదిపేయ సాగారు మెల్లగా కళ్ళు విప్పిన వెంకట్రామయ్యగారు పేలవంగా నవ్వుతూ –

సరసూ! నాకేం కాలేదు బయపడకు నీరసంతో కళ్ళు తిరిగినట్లయి కుర్చీలో వాలానంతే అః వంటయిందా? అన్నారు మాట మారుస్తూ

అయిందండీ! మీ కిష్టమని దొండకాయ పులుసుపెట్టి కూర వండేను త్వరగా లేవండి అన్నారు దుఃఖాన్నదిమిపెడుతూ

వెంకట్రామయ్యగారు లేచి మౌనంగా మడిబట్ట కట్టుకుని, కాళ్ళు చేతులు కడుక్కు వచ్చేసరికి సరస్వతమ్మగారు పీటవాల్చి, విస్తరిలో అన్నం వడ్డించి సిద్ధంగా కూర్చున్నారు సరసూ! నీవు కూడ నాతో బాటు బోజనం చేయి అంటున్న భర్తకేసి మతిబోయిన దానిమల్లె చూస్తుండి పోయారు

ఆవిడ యిన్నేళ్ళ వైవాహిక జీవితంలోను భర్త భుజించిన విస్తరి మీద మరో విస్తరి పరచుకుని భుజించడమే యెరుగును కానీ సహ పంక్తిలో కూర్చుని తిని యెరుగదేమొ భర్త ఏంత ధోరణి అంతుబట్టక తికమకపడ్డారు


సరసూ! నాతో సహకరించి నా నీడలా వుంటూ నాకు కష్టం కలిగించకుండ నడుచుకుంటూ మెప్పించిన నా సరసువేనా నీవు? నా మాటకి యెదురాడని నీకు నా మాట లర్థం కాలేదా? నాతో సహపంక్తిని భోజనం చేయమని వేడుకుంటున్నాను గంభీరంగా వున్న ఆయన కంఠంలోని ఆప్యాయతకి చలించిపోయిన ఆవిడ తొందర తొందరగా మరో విస్తరి తెచ్చుకుని ఆయన ప్రక్కనే చతికిలబడుతూ ఏమండీ మీకేమయిందండీ యివాళ ఎందుకిలా మాట్లాడి నన్ను బాదిస్తున్నారు? మీరు వేడుకోవడ మేమిటండీ నా ముఖం? మీ రెప్పటికీ ఠీవిగా ఆజ్ఞాపిస్తూ వుండాలండీ! అంతేగానీ యిలా డీలాపడి పోతున్న మిమ్మల్ని చూడలేకున్నాను అబ్బాయి 'బాబు' వల్లేకదూ మీరు యింతగా బెంబేలు పడిపోతున్నది? మన కిద్దరు ఆణిముత్యాలవంటి ఆడపిల్ల లుండగా మనకేం కొరత చెప్పండి ఆ వెదవ గురించి మీరిలా అయిపోతే నాగతేం కాను? గొంతు పూడుకు పోవడంతో మరి మాటలు పెగలక నిశ్శబ్దంగా రోదిస్తూండి పోయారు

సరసూ! అన్నం పరబ్రహ్మ స్వరూపం ఇది గతిలేక అప్పుగా ప్రక్కింటి నుంచి బియ్యం తెచ్చి వండేవు నిండు యింట్లో అన్నం ముందు కూర్చుని యిలా దుఃఖించ వచ్చునా ? నాకేం కాలేదని చెబితే వినవేం? ఎందుకో సరదా వేసి నాతో బోంచేయి అన్నందుకే యింత ఏడుపా? సరసూ! నీ వన్నట్లు ఆణి ముత్యాల్లాంటి పిల్ల లుండగా నాకేం దిగులు? శేఖర్‌ని తల్చుకుని నేనిప్పుడు బాధపడటం లేదు వాడన్నట్లు మన కర్తవ్య నిర్వహణ మనం కానిచ్చేము దానికి జీవితాంతం కొడుకు నుండి యేవేవో ఆశించడం అనుచితం కాదూ! ఇల్లు అమ్మేసేము దాచిపెట్టిన సొమ్ము వాడేసేము నీ ఒంటిమీది బంగారం కరిగించేసేము అంటే యిదంతా మనం క్రొత్తగా పెట్టిన దేముంది? మన తదనంతరం యెలాగూ వాడికి చెందవలసినదేగా! కాకపోతే అడ్వాన్స్‌గా యిచ్చేశాము అంతకు వంద రెట్లు సంపాదించుకునే స్థితిలో వున్నాడు వాడు అది గర్వించతగ్గ కారణమే కదా! ఎటొచ్చీ నా బాధంతా ఆడపిల్లల కన్యాయం చేసేనే అని దురపిల్లుతున్నాను వాళ్ళు నా నుండి యే అచ్చటా ముచ్చటాకి నోచుకోలేక పోయారని దుఃఖిస్తున్నాను పుట్టింట అడుగిడి మొదటి కాన్పుకి వచ్చిన శారద తల్లిని 'మీరంతా నామీదపడి దోచుకు తినడానికి దాపురించిన శని ముఖా'లని

యీసడించిన సంఘటన నన్ను మెలిపెట్టేస్తోంది నెలలు నిండిన గర్భిణీ కూతురు నిండుగా నట్టింట నడయాడుతూంటే తిరస్కారంగా తప్పుకు తిరిగేను వుద్యోగస్థురాలవ బోతున్న చిన్న కూతురి సంపాదనపై ఆశతో పెండ్లి చేసేందుకు విముఖుడ్ని అయ్యేను నాకున్న అప్పులు శేఖర్ కోసం చేసిన అప్పులు వసుందర సంపాదనతో తీర్చి గట్టున పడాలన్న వుబలాటంతో యే తండ్రీ ఆలోచించని రీతిలో ప్రవర్తించేను సరసూ! నా పాపానికి ప్రాయశ్చిత్తం లేదు నరకం అంటే యెక్కడో లేదు సరసూ! యిక్కడే యిప్పుడే మనం చేసిన పాపకర్మల ఫలం అనుభవించి మరీ పోతాము నా ప్రస్థుత వ్యథకి కారకుడు శేఖర్ కాదు వాడు నా కళ్ళు తెరిపించి జ్ఞానోదయం చేసిన మహాపురుషుడు వాడికి చేయెత్తి నమస్కరించాలని పిస్తోంది ఆ( అన్నట్టు యింక వారం రోజులే వుంది దీపావళి ఈ పండుగ అందరం కలిసి సరదాగా చేసుకోవాలన్న మంచి బుద్ధి పుట్టి శారద – రామారావులనీ, వసుందర – కృష్ణమూర్తులని శారద అత్తగారు, మామగార్లతో సహా రమ్మనమని వ్రాసి పోస్ట్ చేసి వస్తున్నాను అలా తెల్లబోయి చూస్తున్నావేం? సుదీర్ఘ వుపన్యాస మిచ్చి ఆయాసం తీర్చుకుంటూ చిరునవ్వులు చిందిస్తున్న భర్తకేసి మూఢురాలివలె గుడ్లప్పగించి చూస్తున్న సరస్వతమ్మగారు తేరుకుంటూ మరి మరి ఖర్చులకి డబ్బు? అని మెల్లగా గొణిగారు వసుందర భర్తనీ పిల్లవాడిని చూడాలనీ ఆవిడకీ తహతహగా వుంది లోలోన

అనుకున్న రోజు రానే వచ్చింది మళ్ళీ చాల కాలానికి వెంకట్రామయ్యగారి యిల్లు కళకళలాడి పోతోంది సరస్వతమ్మగారి ఆనందాని కవదు ల్లేకపోయింది పిండి వంటల హడావిడితో అల్లుళ్ళకి కావలసినవి చూడండంటూ కూతుళ్ళని పురమాయించడంలో సతమతమయి పోతూనే బిక్కు బిక్కుమని చూస్తున్న శారద పిల్లలిద్దరినీ పసిగుడ్డు వసుంధర బాబునీ మధ్య మధ్య పలుకరిస్తూ ముద్దాడుతూ ఆనందబాష్పాలు తుడుచుకుంటున్నారు శారద మామగారిని తీసుకుని అలా బజార్లోకి వెళ్ళొస్తానేవ్ అంటున్న వెంకట్రావుగారిని కళ్ళ నిండుగా చూసుకుంటూ అలాగే వెళ్ళి చప్పున వచ్చేయండి అంది సరస్వతమ్మ

రిక్షా నిండుగా సామాన్లతో వచ్చిన తండ్రిని తెల్లబోతూ చూస్తుండి పోయారు శారద, వసుంధరలు రామారావు, కృష్ణమూర్తి పరుగున యెదురెళ్ళి నొచ్చుకుంటూ ఏమిటండి మామగారు యిప్పుడీ ఖర్చంతా? అంటుంటే రాక రాక వచ్చేరు నా సంతోషాని కానకట్ట వేయకండి అందులో చిన్నల్లుడు మొట్టమొదటిసారిగా అత్తింట అడుగు పెట్టేడాయిరి ఈ మాత్రమేనా చేయకపోతే యెలాగోయ్ అనేసి ఏమోయ్ సరసూ! తొందరగా వడ్డన కార్యక్రమాలు చూడు సాయంత్రం అయ్యేసరికి చిట్టి చిట్టి చేతులని పట్టుకుని బాణా సంచా కాల్పించాలి కూడాను అంటున్న ఆయన మాటలకి ఇదిగో అయిపోయింది క్షణంలో వడ్డించేస్తాను అని సరస్వతమ్మ జవాబిచ్చింది అందరి భోజనాలు ముగియడంతో అందరినీ వరుసగా కూర్చోబెట్టి పేరు పేరునా రెడీమేడ్ బట్టలు పెడుతూ సాయంత్రం కట్టుకోవాలందరూ అని అల్టిమేటమ్ జారీ చేశారు అందరికీ వెంకట్రామయ్యగారి ధోరణి వింతగా అనిపించసాగింది 'వద్దు వద్దు' అంటున్న కూతుళ్ళనీ, అల్లుళ్ళనీ, వియ్యంకుడు-వియ్యపురాలిని నన్ను బాధపెట్టడం మీకభిమతమా! అంటూ నోరు నొక్కేసారు 'ఇంత డబ్బు యెలా వచ్చిందీయనకు?' అన్న ఆలోచనలతో తల మునకలవుతూ మౌనంగా బట్టలు కట్టుకున్నా రందరూ కుతూహలం అపుకోలేని కూతుళ్ళిద్దరూ తల్లిని అడగనే అడిగేశారు అమ్మా! ఎక్కడిదే యింత డబ్బు? ఎందుకింతలా ఖర్చు పెడుతున్నారు? అంటూ ఏమో నాకేం తెలుసే తల్లీ! నాకేమన్నా చెబుతారా పెడతారా? అంటూ నిండుగా నవ్వుతున్న తల్లిని అయోమయంగా చూస్తుండిపోవడం మినహా మరి తర్కించలేక పోయారు ఎంతో సందడిని తెచ్చిన దీపావళి సంతోషంగా గడిచిపోయింది ఒక్కొక్కరూ లేచి




దంతదావనం ముగించు కొచ్చినా యింకా లేవని సరస్వతమ్మగారిని లేపేందుకు శారద వెళ్ళడం చూసిన ఆమె అత్తగారు నిన్న రోజంతా బొంగరంలా పనిచేసి అలసి నిద్రపోయారు పోనీ పడుకోనీయరాదుటే ఆ కాఫీ యేదో నీవు, వసుందర కలపొచ్చుగా అంటున్న అత్తగారితో అలాగే అనేసి వంటింటికేసి నడిచింది అక్కా! ఏమండీ అంటూ పెద్దగా ఆర్తనాదం చేసిన వసు కంఠానికి అందరూ అటు ఒక్క వుదుటున పరుగెట్టేరు అక్కడ పడక గదిలో ఒకరి చేతిలో ఒకరి చేయి పెనవైచుకుని మందస్మిత వదనంతో శాశ్వత నిద్రపోతున్న వెంకట్రామయ్య– సరస్వతమ్మ గార్లని చూసి అందరూ హొల్లుమన్నారు

వెంకట్రామయ్యగారి మంచం ప్రక్క స్టూలుమీద ఎగురుతున్న కాగితాన్ని చప్పున రామారావు అందుకుని పైకే చదివేశాడు రుద్ధ కంఠంతో

అమ్మా శారదా! వసూ!

వస్తాం తల్లీ! శారదా! శాశ్వతంగా నీయింటే మా యిద్దరి జీవితాలు చల్లగా గడచిపోగలవనీ దానికి మీ కుటుంబ సభ్యులందరి మహోన్నత వ్యక్తిత్వపు ఛాయ వుందనీ, వారి ఆదరణ ఆహ్వానం మాకు సదా లబించగలవని పూర్తి నమ్మకం వున్నా యింతటి మమతాను రాగాలు, ఆప్యాయతనీ కూడ మనిషి తట్టుకోలేడు తల్లీ! నిజంగా మీ యిల్లొక దేవాలయం నీవారు అందరూ దేవతా స్వరూపులే నాలాంటి నికృష్టుడు మీ ముందు తలెత్తుకు తిరగ గలడా తల్లీ! నీ మనస్సెంత క్షోభ పెట్టేనో, అది తల్చుకుని నేనెంత మనఃక్షోబ ననుబవించేనో ఆ బగవంతుడి కెరుక చిన్నపిల్ల వసుందర పిల్ల పాపలతో కళకళ లాడుతోందంటే అది నీ చలవ మీ అమ్మ చలువ నా పాపిష్టి ఆలోచన లెంతమటుకు దాని సంపాదన తింటూ కన్యగానే మిగిల్చేయాలన్న దుర్బుద్ధే కదా! అటువంటి దుర్మార్గుడు మీ ముందు యెలా నడయాడ గలడనుకున్నావు తల్లీ! శారదా? నా దృష్టిలో ఆడపిల్ల మహావరం తలిదండ్రుల మనస్సెరిగి లాలించే తల్లి వంటిది నాలో యింకా పూర్వకాలపు రక్తం ప్రవహిస్తోందమ్మా! అందుకే అభిజాత్యాన్ని, అహంకారాన్ని వదులుకోలేక, శేష జీవితాన్ని మీతో గడిపే ప్రయాణ సన్నాహం చేయ సాహసించక, అంతిమ ప్రయాణమయి వెళ్ళిపోతున్నాను అమ్మను తీసుకుని కొడుకు లేదన్న బాధ మాకిద్దరికీ లేదు మా అంతిమ ప్రయాణ సన్నాహాలు అల్లుళ్ళ చేతులమీదుగా జరిగి పోవాలని మా కోరిక ఇంత డబ్బు ఎక్కడిదో చెప్పనా? మీ అమ్మ మంగళ సూత్రాలు అమ్మగా వచ్చినది మిగిలిన డబ్బు దేవుడి పటం ముందువుంది దహన సంస్కారాలకి వినియోగించండి

ఇట్లు,

అదృష్టవంతుడైన మీ నాన్న □